# కంకర పోశారు.. వదిలేశారు

- అసంపూర్తిగా మిగిలిన పెద్దవంగర-గంట్లకుంట తారు రోడ్డు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- ఆరు కిలోమీటర్లకు బదులు 35 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన
- పట్టించుకోని అధికారులు



కంకర పోసి వదిలేయడంతో అధ్వానంగా మారిన పెద్దవంగర-గంట్లకుంట రోడ్డు

పెద్దవంగర, మే 14 : మండల కేంద్రం నుంచి గంట్లకుంటకు వెళ్లే రోడ్డులో కంకర పోసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో రోజులుగా ఇలా కంకర పోసి ఉండడంతో మండల కేంద్రానికి రావాలంటే ఆయా గ్రామాలకు చెందిన ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రానికి 6 గంట్లకుంట, పోచంపల్లి కిలోమీటర్లు, కాన్వాయిగూడెం 7 కిలోమీటర్ల దూరంలో ఉన్నా ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రంలో పనుల నిమిత్తం వెళ్లాలంటే 35 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోంది. చాలా రోజుల క్రితం నూతనంగా రోడ్డు వెడల్పు చేసి, తారు రోడ్డు వేయడానికి దారిని తవ్వారు. కంకర పోశారు. కానీ, తారు వేయకపోవడంతో కంకర రోడ్డుపై వాహనదారులు రావాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తారు రోడ్డును త్వరగా పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### తిప్పలు తప్పడం లేదు



మండల కేంద్రంలోని కార్యాలయాల్లో పనుల నిమిత్తం వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎన్నో రోజులుగా కంకర పోసిన రోడ్డు అధ్వానంగా మారింది. కాన్వాయిగూడెం, గంట్లకుంట, పోచంపల్లి గ్రామాల ప్రజలు మండల కేంద్రం పోవాలంటే 35 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోంది. తారు రోడ్డు వేస్తే ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోనే మండల కేంద్రానికి ప్రజలు చేరుకోవచ్చు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు వేయాలి.

– చెరుకు సత్యం, గంట్లకుంట గ్రామం

## నైపుణ్యం పెంచుకోవాలి

మహబూబాబాద్ రూరల్, మే 14 : వేసవిలో ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా నైపుణ్యం పెంచుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. పట్టణ శివారు అనంతారం ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గంగారం, కొత్తగూడ, గూడూరు, బయ్యారం వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా హెచ్ఎంలు బాధ్యత తీసుకోవాలన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి, అప్పారావు, మందుల శ్రీ రాములు, ఆజాద్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

మహబూబాబాద్ రూరల్, మే 14 : కాళేశ్వరంలో గురువారం నుంచి జరుగనున్న సరస్వతీ పుష్కరాలకు మానుకోట డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు డీఎం శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.210 టికెట్‌తో ఈ నెల 26 వరకు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఈ పాస్‌తోనే విక్రయించాలి

మహబూబాబాద్ రూరల్, మే 14 : రైతులకు ఈ పాస్ మిషన్ల ద్వారా మాత్రమే డీలర్లు ఎరువులను విక్రయించాలని ఏవో తిరుపతి రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఏటిగడ్డ తండా రైతు వేదికలో ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. డీలర్లకు ఈ పాస్ మిషన్లు అందజేశారు. ఇఫ్కో సేల్స్ మేనేజర్ విశాల్, కంపెనీ ఉద్యోగులు వీరన్న, సతీశ్ పాల్గొన్నారు.

## సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా రమేశ్



మహబూబాబాద్ రూరల్, మే 14 : సేవాలాల్ సేన మానుకోట మండల అధ్యక్షుడిగా వేంనూరు గ్రామ శివారు పెద్దలింగ్యా తండాకు చెందిన బోడ రమేశ్ నాయక్ నియమితులయ్యారు. బుధవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ సేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్ ఆధ్వర్యంలో ఆయనను ఏకగ్రీవంగా నియమించారు. కాగా, తనపై నమ్మకంతో నియమించినందుకు సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీకి బోడ రమేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వివాహిత అదృశ్యం



సమీనా

గార్ల, మే 14 : వివాహిత అదృశ్యమైంది. ప్రొబెషనరీ ఎస్సై మైబూబీ కథనం ప్రకారం.. పట్టణంలోని జెండా బజారుకు చెందిన సయ్యద్ సమీనా బుధవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి పోయింది. చుట్టు పక్కల వారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియ లేదు. భర్త షారుక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

**WANTED**

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

నెల్లికుదురు, మే 14 : ఉరి వేసుకుని యువకుడు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం.. మండలంలోని నైనాల గ్రామానికి చెందిన కొంకపల్లి తేజ(26) బుధవారం ఉదయం తన ఇంట్లో దుప్పటిని చింపి దాంతో దూలానికి ఉరివేసుకున్నాడు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్ కోసం తేజ ఇంటికి వచ్చి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. కాగా, అంతకు ముందు తెల్లవారుజామున తేజ బైక్‌పై తొర్రూరు వైపు వెళ్లడం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చూశాడు. అయితే, తన తమ్ముడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తేజ సోదరి వెల్లపు జాహ్నవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ దవాఖానకు తరలించారు.

## ఆర్థిక సమస్యలతో మరొకరు..



బద్రు(ఫైల్)

మరిపెడ, మే 14 : ఆర్థిక సమస్యలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మరిపెడ పురపాలక సంఘం పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీలికుర్తి రెవెన్యూ పరకజల్ల తండాకు చెందిన నేతావత్ బద్రు(45) జీవనోపాధి కోసం పురపాలక సంఘంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యంతో పాటు ఆర్థిక సమస్యలు అధికం కావడంతో మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో మహబూబాబాద్ దవాఖానకు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు.

## అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్యాయత్నం

తొర్రూరు, మే 14 : అప్పుల బాధ తట్టుకోలేక ఒకరి ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తొర్రూరు పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన శ్రీరామ్ ప్రవీణ్ కొన్నేళ్లుగా తొర్రూరులోని దుబ్బ తండా సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న కింగ్స్‌వే దాబాను కిరాయికి తీసుకొని నిర్వహిస్తున్నాడు. అయితే వ్యాపారానికి సరైన ఆదరణ లేకపోవడంతో అప్పుల భారం పెరిగింది దీంతో బుధవారం ఉదయం పెట్రోల్ బంక్ నుండి పెట్రోల్ తీసుకుని దాబాలోకి వెళ్లి మీద పోసుకొని నిప్పంటించుకున్నాడు. పొగలు రావడంతో గమనించిన పెట్రోల్ బంక్ సిబ్బంది, స్థానికులు వెంటనే మంటలను ఆర్పి, అతడిని 108 ద్వారా హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, ఈ ఘటనపై ఇప్పటి వరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

## వడదెబ్బతో మహిళ మృతి



యాకమ్మ(ఫైల్)

గార్ల, మే 14 : వడదెబ్బతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి పాత పోచారానికి చెందిన గడ్డి యాకమ్మ(60) రెండు రోజులుగా గ్రామంలో ఉపాధి పనికి వెళుతోంది. బుధవారం పనికి వెళ్లి అక్కడే వడదెబ్బతో స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు గార్ల ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## దాడి కేసులో నలుగురు అరెస్టు

కురవి, మే 14 : భూ వివాదంలో ఒకరిపై దాడి చేసిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పీఎస్సై కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని కంచర్లగూడెం గ్రామంలో గత నెల 27న చిలువేరు అనిల్‌పై అతడి మామ శనిగచర్ల మురళీకృష్ణ, కుటుంబసభ్యులు శనిగచర్ల ప్రవీణ్ కుమార్, వెంకన్న, కలమ్మ విచక్షణారహితంగా దాడి చేయడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. అనిల్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పారువేటలో కొట్లాట



ఫలహారం బండ దగ్గర గొడవ పడుతున్న యువకులు

నర్సింహులపేట, మే 14 : మండల కేంద్రంలోని కపిల గిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పారువేట(బండ్లు తిరుగు) కార్యక్రమం జరిగింది. దీంతో వివిధ గ్రామాల నుంచి ఎండ్లబండ్లు, ట్రాక్టర్లలో భక్తులు వచ్చారు. ఈ క్రమంలో ఫలహారం బండ వద్ద ఎండ్లబండ్లు, ట్రాక్టర్లు ఒకేసారి రావడం, క్యాపాటించపోవడం, ఇష్టం వచ్చినట్లు ఫలహారం బండ చుట్టూ తిప్పడంతో ఎడ్లు బెదిరాయి. దీంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తుల మధ్య గొడవ జరిగి, ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పోలీసు బందోబస్తు లేక పోవడంతోనే ఇలా గొడవలు జరిగాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## జీపీ ట్రాక్టర్ బోల్తా.. ఒకరికి గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్

కేసముద్రం, మే 14 : మండలంలోని అర్పనపల్లి సమీపంలో జీపీ ట్రాక్టర్ బుధవారం బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కాట్రపల్లి గ్రామంలో మూడు రోజుల నుంచి గ్రామ దేవతలు పండుగ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అర్పనపల్లి గ్రామానికి చెందిన వాటర్ ట్యాంకర్‌ను కాట్రపల్లికి చెందిన ట్రాక్టర్ ద్వారా మూడు రోజుల క్రితం తీసుకెళ్లారు. పండుగ ముగియడంతో ట్యాంకర్‌ను ట్రాక్టర్ ద్వారా తీసుకొస్తుండగా అర్పనపల్లి సమీపంలో వాగు వద్ద ఎదురుగా వస్తున్న పశువులను తప్పించబోయి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్ ప్రశాంత్ చాకచక్యంగా దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

# క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటా

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



యాకయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న దయాకర్‌రావు

తొర్రూరు, మే 14 : పార్టీ క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పల్లె యాకయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న దయాకర్‌రావు బుధవారం గ్రామానికి చేరుకొని యాకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన వారికి అండగా ఉంటానన్నారు. యాకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తొర్రూరు మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ, జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి నలమాస ప్రమోద్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, నాయకులు మయూరి వెంకన్న, గ్రామ మాజీ సర్పంచ్‌లు నరేడ్ల శ్రీపాల్ రెడ్డి, పల్లె సర్వయ్య, లకిడి శ్రీధర్‌రెడ్డి, పల్లె యాకన్న (రాజ్), పార్టీ తొర్రూరు సోషల్ మీడియా అధ్యక్షుడు యర్రం రాజు, పేరబోయిన ప్రభాకర్, ఎడెల్లి మురళి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నాయకుల జోక్యం వద్దు

- అధికారులే ఎంపిక చేయాలి
- సీపీఐ(ఎంఎల్)ఎన్‌డీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నెల్లికుదురు, మే 14 : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రాజకీయ నాయకుల జోక్యం ఉండొద్దని, అర్హులైన వారిందరికీ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్)ఎన్‌డీ రాష్ట్ర నాయకుడు బండారి అయిలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రం అంబేద్కర్ సెంటర్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించి, కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కాంగ్రెస్ పార్టీ సొంతానికే పరిమితమైందని ఆరోపించచారు. డబ్బులు ఇచ్చినోళ్లకు, కాంగ్రెస్ నాయకుల అనచరులకు మాత్రమే ఇస్తున్నారన్నారు. గ్రామల్లో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను రద్దు చేయాలన్నారు. కేవలం అధికారులే అర్హుల జాబితా సిద్ధం చేయాలని కోరారు. అవకతవకలను అరికట్టకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు హెచ్ లింగన్న, చిర్ర యాకన్న, ఇరుగు అనిల్, నక్క యాకయ్య, ఎస్‌కే సాజన్, ఎడ్ల మల్లయ్య, డొనికేన ఎల్లయ్య, రాములు, రమేశ్, ఆకుతోట ఉప్పలయ్య, విజయ, సుజాత పాల్గొన్నారు.

# పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని..

- తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయానికి తాళం
- బాధితుడు జలగం శంకర్ ఆందోళన



కార్యాలయానికి తాళం వేస్తున్న జలగం శంకర్

తొర్రూరు, మే 14 : నాలుగేళ్లుగా తొర్రూరు మున్సిపాలిటీ తరపున పలు ప్రైవేట్ కాంట్రాక్టు పనులు చేసిన జలగం శంకర్ (సిరి డెకరేషన్) తనకు పెండింగ్ బకాయిలు చెల్లించడం లేదని నిరసన తెలుపుతూ బుధవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయానికి తాళం వేశాడు. అధికారుల స్పందన వచ్చే వరకూ తాళం తీయనని స్పష్టం చేశాడు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బతుకమ్మ, దసరా, శతాబ్ది ఉత్సవాలు, ఎమ్మెల్యే కార్యక్రమాలకు ఎల్ఈడీ మానిటర్లు, సౌండ్ సిస్టం, డెకరేషన్స్ వంటివి అనేక కార్యక్రమాలు చేశానని, మొత్తం రూ.16.80లక్షల బకాయి ఉందని తెలిపాడు. ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, కమిషనర్ శాంతి కుమార్‌ను పలుమార్లు కలిసినా, స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కమీషన్ ఇస్తే బిల్లులు ఇస్తానన్నారని, అంగీకరించనప్పటికీ డబ్బులు ఇవ్వడం లేదని వాపోయాడు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అధికారులు స్పందించకపోతే, కుటుంబంతో కలిసి కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తన బకాయి బిల్లులు చెల్లించాలని కోరారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ సీజ్

నర్సింహులపేట, మే 14 : అక్రమంగా కుంట మట్టి తరలిస్తున్న జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్సై ఎం సురేశ్ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని చెన్నమ్మకుంటలో జేసీబీతో ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా మట్టి తరలిస్తుండడంలో ఐబీ డీఈ రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు జేసీబీని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

## బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

కురవి, మే 14 : పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను బాధితుడికి కురవి పీఎస్సై కృష్ణారెడ్డి బుధవారం అందజేశారు. బొమ్మెర సంపత్ ఈ నెల ఒకటిన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ఆపరేటర్ నరేశ్ విచారణ చేపట్టి, దాన్ని కనుగొన్నాడు. బాధితుడు సంపత్‌కు బుధవారం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

## యాదవ విద్యావంతుల వేదిక నూతన కమిటీ

మహబూబాబాద్ రూరల్, మే 14 : జిల్లా యాదవ విద్యావంతుల వేదిక నూతన కమిటీని బుధవారం పట్టణంలో వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సందా కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులుగా లెంకపల్లి శ్రీను యాదవ్, సింగం సరిత, ప్రధాన కార్యదర్శిగా ఉగ్గుల అశోక్ యాదవ్, సహాయ కార్యదర్శిగా సంద మహేశ్ ఎన్నికయ్యారు.

# నాడు ఆదర్శం.. నేడు అధ్వానం

- నిర్వహణ లోపంతో ఎండిపోయిన నర్సింహాపురం బంజర పల్లె ప్రకృతి వనం
- పట్టించుకోని అధికారులు

నర్సింహులపేట, మే 14 : కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో గతంలో మండలాల్లో పార్కులను ఏర్పాటు చేసింది. ఆ పార్కులు ఎండిపోకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అవి ఎండిపోయి కళావిహీనంగా మారుతున్నాయి. గతంలో మండలంలోని నర్సింహాపురం బంజర జీపీ పరిధిలో సుమారు రూ.10లక్షల వ్యయంతో 5 వేల వివిధ రకాల మొక్కలు పెంచారు. దీంతో మూడేళ్ల పాటు మొక్కలను రక్షించడంతో పచ్చదనం వెల్లివిరిసింది. దీంతో ఈ పార్కులో పలు వివాహాలకు వీడియో షూట్స్ సైతం తీశారు. అయితే, అధికారుల పట్టింపులేని తనంతో ప్రస్తుతం ఆ పల్లె ప్రకృతి వనం ఎండి పోయిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు ఎండి పోకుండా నీరు అందించి పచ్చదనం తీసుకురావాలని కోరుతున్నారు.



నాడు పచ్చదనంతో కళకళలాడుతున్న పల్లె ప్రకృతి వనం(ఫైల్)



ప్రస్తుతం ఎండిన చెట్లతో కళావిహీనంగా మారిన పార్కు

## కేసముద్రం స్టేషన్‌లో పలు రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్

కాజీపేట, మే 14 : మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో ఈ నెల 24 నుంచి 27 వరకు జరుగుతున్న మూడో లైన్ ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో విజయవాడ నుంచి వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మీదుగా నడిచే పలు రైళ్లకు కేసముద్రం స్టేషన్‌లో తాత్కాలిక హాల్టింగ్ ఏర్పాటు చేశారు. ఈ నెల 24 నుంచి 26 వరకు మణుగూర్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం–బీదర్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ పోర్టు–లింగంపల్లి గౌతమీ ఎక్స్‌ప్రెస్, గూడూర్– సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్, తిరుపతి–సికింద్రాబాద్ పద్మావతి, విశాఖపట్నం– హైదరాబాద్ గోదావరి, విశాఖపట్నం– మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, తాంబరం–హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఆగుతాయని రైల్వే అధికారులు తెలిపారు. అలాగే, ఈ నెల 24న తిరుపతి– కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, 24 నుంచి 26 వరకు భువనేశ్వర్–ముంబై కోణార్క్, ఈ నెల 27న మచిలీపట్నం– సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, 26న కాకినాడ పోర్టు–సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, 24 నుంచి 26 వరకు శాలిమార్– హైదరాబాద్ మధ్య నడిచే ఈస్ట్‌కోస్ట్, ఈ నెల 25, 27 తేదీల్లో నర్సాపూర్ – నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, 25న చెన్నై సెంట్రల్ –అహ్మదాబాద్ మధ్య నడిచే నవజీవన్, 27న బెంగళూరు– లాల్ కౌన్ ఎక్స్‌ప్రెస్, 27న కోయంబత్తూర్–ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌ను కేసముద్రంలో నిలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.



రైతులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శాంతి ప్రియదర్శిని

## ఉద్యాన పంటల సాగుతో రైతులకు లబ్ధి

మహబూబాబాద్ రూరల్, మే 14 : రైతులు ఉద్యాన పంటలను సాగు చేయడం వల్ల అధిక లాభాలు వస్తాయని ఉద్యాన శాఖ క్లస్టర్ అధికారి శాంతి ప్రియదర్శిని అన్నారు. బుధవారం మండలంలోని బేతోలు, అమనగల్, శనిగపురం గ్రామాల్లోని ఉద్యాన పంటలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వేసవిలో ఉద్యాన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. బెండ, టమాటా వంటి కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ, నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యాన పంటల సాగు విధానం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

## ధాన్యం కాంటాలు త్వరగా నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్, మే 14 : జిల్లాలోని ఐకేపీ కేంద్రాల్లో వరి ధాన్యం కాంటాలను త్వరగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారథి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ శివారులోని శనిగపురంలో ఐకేపీ ధాన్యం సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణంలో మార్పు వల్ల వర్షాలు పడే అవకాశం ఉందని, వెంటనే కాంటాలు పెట్టి లారీల ద్వారా మిల్లులకు ధ్యాం తరలించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, లింగ్య, రమేశ్, అనిల్, వెంకన్న పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

మహబూబాబాద్ రూరల్, మే 14 : ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకే ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, ఎక్సైజ్ అధికారులు కిరణ్, చిరంజీవి పాల్గొన్నారు.



విద్యార్థినులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ లాలు

## 'ఏకలవ్య'లో వంద శాతం ఫలితాలు

కురవి, మే 14 : సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కురవి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ లాలు తెలిపారు. మొత్తం 60 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ పాస్ అయ్యారని పేర్కొన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు బీ అక్షయ, జీ నందిని, వీ నందినిని పాఠశాల ఆవరణలో బుధవారం ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు.



గోదాములో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

## పుస్తకాల గోదాం పరిశీలన

కేసముద్రం, మే 14 : మండలంలోని కేసముద్రం విలేజీ హైస్కూల్‌లో ఉన్న పాఠ్యపుస్తకాల గోదామును బుధవారం ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి కేసముద్రంలోని పుస్తకాల గోదాం నుంచి అన్ని మండలాలకు పుస్తకాలు పంపించాలని సూచించారు. జిల్లాకు 3,19,660 పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,21,880 వచ్చాయని గోదాం మేనేజర్ చీకటి వెంకట్రామనర్సయ్య తెలిపారు. ఆయన వెంట డీఈవో రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



దంతాలపల్లి : పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కురవి/దంతాలపల్లి, మే 14 : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు. కురవిలో బుధవారం వివిధ రంగాల కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, కరణం ముత్తయ్య, కంచం వీరన్న, రామచంద్రు, కొండ వెంకన్న, కట్ల కృష్ణయ్య, తోట వీరన్న, సంజీవ, నీలమ్మ, బూలి పాల్గొన్నారు. అలాగే, దంతాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, సెగ్గెం యాకయ్య, కొమురయ్య, యాకయ్య, సంతోష్, భిక్షపతి పాల్గొన్నారు.